క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.కొండూరు(ఇబ్రహీంపట్నం): జి.కొండూరు, కుంటముక్కల విద్యుత్ సబ్ స్టేషన్లలో మాసాంతపు మరమ్మతుల కారణంగా శనివారం ఆయా విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ రామ్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7.00 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

గొల్లపూడి సెక్షన్ పరిధిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ జైన్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జైన్ కాలనీ, బైపాస్ రోడ్డు ఏరియా, బాలాజీ టవర్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

26న దేవాలయ భూముల కౌలు వేలం

జూపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని జూపూడిలో శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవాలయ భూములకు ఈనెల 26వ తేదీన కౌలు హక్కు టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తామని మండల ఆలయాల కార్యనిర్వహణ అధికారి సీతారావమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 131, 127/2లో 17.42 ఎకరాల వ్యవసాయ భూమికి మూడేళ్ల కాలపరిమితికి ఆలయ ఆవరణలో దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో సోమవారం ఉదయం వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని చెప్పారు.

బీమా నగదు అందజేత



పెనుగొలను(గంపలగూడెం): మండల పరిధిలోని పెనుగొలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సభ్యుడు దేవర శ్రీనివాసరావు(40) ఇటీవల మృతి చెందగా మంజూరైన బీమా నగదు రూ.లక్షను శుక్రవారం కుటుంబీకులకు అందజేశారు. సొసైటీలో నిర్వహించిన కార్యక్రమంలో మృతుడి భార్య నాగమణికి గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నగదు అందించారు. బ్యాంక్ సూపర్‌వైజర్ కొండయ్య, సీఈఓ నామా నరసింహారావు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం

నూజివీడు: పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల ఆవరణలోని బాస్కెట్‌బాల్ కోర్టులో మే 1 నుంచి నిర్వహించిన బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, సముద్రరావు మెమోరియల్ ఫ్రెండ్స్ క్లబ్, ఏబీఏ నూజివీడు, డీఏఆర్ కళాశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులు బాస్కెట్‌బాల్ క్రీడలో మంచి ప్రావీణ్యత సాధించి నూజివీడుకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వేణుగోపాలరావు, పి.సత్యనారాయణ, బాస్కెట్‌బాల్ సీనియర్ ప్లేయర్స్ జే.రమేష్, వై.నారాయణ, ఆక్రో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ పీ సాధన, కోచ్‌లు శ్రీనివాస్, అవినాష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు మెరుగుపర్చాలని వినతి

తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల అవసరాల మేరకు బస్సు సర్వీసులు పెంచాలని శుక్రవారం జరిగిన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు కోరారు. డిపో మేనేజర్ వేణు నిర్వహించిన కార్యక్రమంలో తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, మైలవరం, ఏ.కొండూరు మండలాలకు చెందిన ప్రయాణికులు తమ సమస్యలను వివరించారు. గతంలో నడిపిన బస్సు సర్వీసులను అర్ధాంతరంగా రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. హైదరాబాద్‌కు పగటి సర్వీసులు పునరుద్ధరించడంతో పాటు విజయవాడకు నాన్‌స్టాప్ బస్సు సర్వీసులు నడపాలన్నారు. జమలాపురం, నెమలి, జగ్గయ్యపేట, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులు తిరిగి ప్రారంభించాలని, తిరువూరు బస్టాండులో క్యాంటీన్ తెరవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

నందిగామ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. పౌరసరఫరాల శాఖ డీటీ కె. రామ్మూర్తిరెడ్డి కథనం మేరకు అంబారుపేట వైపు నుంచి లారీలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వాహనాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో లారీలో తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు సదరు వ్యాపారిపై కేసు నమోదు చేశామన్నారు. లారీని సీజ్ చేసినట్లు డీటీ తెలిపారు.

సంక్షేమ పథకాల అమలు సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే కె.రక్షణనిధి
- ఊటుకూరులో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



రాజులపాలెంలో వృద్ధుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు

రాజులపాలెం/ఊటుకూరు(గంపలగూడెం): ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సంక్షేమ పథకాలను నిరాటంకంగా అమలు పర్చటం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరు సచివాలయం పరిధిలో ఐదో రోజైన శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తర దళితవాడ, శివారు గ్రామమైన రాజులపాలెంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అందిన పథకాలను వివరించటంతో పాటు సంబంధిత వివరాలతో ముద్రించిన బ్రోచర్లను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

అనంతరం ఊటుకూరులో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే ప్రజలు జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్ల వద్దకే పథకాలను అందిస్తున్నామని చెప్పారు. 2,313 కుటుంబాలు, 6,713 జనాభా ఉన్న గ్రామంలో సంక్షేమ పథకాల కింద రూ.31.86 కోట్లు, అభివృద్ధి పథకాలకు రూ.3.94 కోట్లు వెరసి రూ.35.80 కోట్లు ఖర్చు చేశామన్నారు. గ్రామ ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీనికై గ్రామ సచివాలయాల గ్రాంటు రూ.30 లక్షలు విడుదల చేస్తామన్నారు. ప్రధానంగా గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం, ధ్వంసమైన విద్యుత్ స్తంభాల మార్పు, అవసరం ఉన్న చోట విద్యుత్‌లైన్ ఏర్పాటు, సిమెంట్ రహదారుల నిర్మాణానికి నిధులు ఖర్చు చేస్తామన్నారు. ఊటుకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు అలపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీపీ జి.శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, సర్పంచ్ బి.రేణుక, తిరువూరు ఏఎంసీ చైర్మన్ ఎస్.నాగనర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, కాజా నాగేంద్రరావు, డీఎస్ఆర్, వీ ప్రకాశ్‌బాబ్జి, కె.కృష్ణారావు, కె.కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.దాసు, పి.శశాంక్, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

నేడు గాదెవారిగూడెంలో..

గాదెవారిగూడెం(గంపలగూడెం): మండల పరిధిలోని గాదెవారిగూడెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానం



కూనపరాజుపర్వ గ్రామంలో ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి



కుంటముక్కల గురుకుల పాఠశాలలో సర్టిఫికెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ జక్రధరరావు తదితరులు

రెడ్డిగూడెం: మండల పరిధిలోని కూనపరాజుపర్వ గ్రామ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి శుక్రవారం అందజేశారు. 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన అర్ల లావణ్య, బత్తుల గాయత్రి, బజారు రీషితలకు ప్రోత్సాహకాలను అందించారు.

విద్యా వ్యవస్థ బలోపేతం..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు-నేడు, పాఠశాలల భవనాల అభివృద్ధితో పాటు అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక, వసతి దీవెన తదితర పథకాలతో జగనన్న ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా బలోపేతం చేసిందన్నారు. పేదల బిడ్డలను మరింత ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో తోటకూర రవిబాబు, సర్పంచ్ మతాంగి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ రామిళ్ల బాబురావు, పాలకపాటి ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ గుర్తి నారాయణ, చింత శ్రీనివాసరావు, గుత్తి ప్రసాద్, ఆకుల రామకృష్ణ, అర్ల ముత్తయ్య, హెచ్‌ఎం జి.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

కుంటముక్కల(ఇబ్రహీంపట్నం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా టెన్త్ క్లాస్‌లో ప్రతిభ చూపిన బాలికలకు నగదు పురస్కారాలను జెడ్పీటీసీ సభ్యులు మందా జక్రధరరావు శుక్రవారం పంపిణీ చేశారు. జి.అర్చన, డి.హర్షిత, వి.కావ్యలకు నగదు, మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశారు. బాలికల తల్లిదండ్రులను సత్కరించారు. విద్యకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. సర్పంచ్ వంగూరి కుమారి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న అధికారులు

చాట్రాయి: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ శ్రీదేవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణాలు పూర్తయిన 436 గృహాలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అధికారులను కోరారు. పూర్తయిన గృహాలకు సంబంధించి అఫిడవిట్ అందజేస్తే ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆమె చెప్పారు. జగనన్న లే అవుట్లలో, సొంత స్థలాల్లో గృహ నిర్మాణాలు చేపట్టిన వారికి నిర్మాణ సామగ్రి అందజేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు. సాంకేతికపరమైన సమస్యలు తొలగిన వెంటనే లబ్ధిదారులకు సామగ్రి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, నాయకులు చెలికాని బాబ్జీ, మోరంపూడి నాగేశ్వరరావు, పామర్తి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్, ఎంపీడీవో దుర్గాప్రసాద్, తహసీల్దార్ విశ్వనాథరావు, ఈవోపీఆర్డీ నాగరాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పనపై శ్రద్ధ వహించాలి

ముసునూరు: మండల వ్యాప్తంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి దయాల ఆశ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.రాణి అధ్యక్షతన గృహ నిర్మాణ శాఖ పని తీరుపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకునేందుకు అనువుగా అంతర్గత రహదారులు, బోరు, విద్యుత్, తదితర సౌకర్యాలను తక్షణమే కల్పించాలని ఆదేశించారు. అనంతరం జగనన్న సురక్ష పథకంపై సక్రమ, సమగ్ర నిర్వహణపై అధికారులకు, సూపర్‌వైజర్లకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, హౌసింగ్ ఈఈ శ్రీదేవి, డీఈ రంగారావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఏఈలు నరసింహారావు, సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎంఈవో రాజశేఖర్

ఏ.కొండూరు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం జగనన్న విద్యా కానుక కిట్లను 200 మంది విద్యార్థినిలకు ఎంఈవో రాజశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు జగనన్న విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందించామన్నారు. ఒక్కొక్క విద్యార్థికి మూడు జతల స్కూల్ యూనిఫామ్, షూ, సాక్సులు, బెల్టులు, బ్యాగులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగపండు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపక శిక్షణ శిబిరం

కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన ఐటీసీ అకాడమీ సంయుక్తంగా అధ్యాపక శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. ఐదు రోజుల నుంచి ప్రముఖ ఎడ్ టెక్ సంస్థ ఐటీసీ అకాడమీకి చెందిన ప్రొఫెసర్ కుమారగురు 'రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ అసోసియేట్' అను నూతన సాంకేతికతపై శిక్షణ ఇచ్చామన్నారు. రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ వలన నియమ ఆధారిత పనులను ఆటోమేట్ చేసేందుకు ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. ప్రతి సంస్థలో ఆటోమేట్ చేయగల ప్రక్రియలను గుర్తించి క్రమబద్ధీకరించి తద్వారా వాటిని ఆటోమేట్ చేయవచ్చని సూచించారు. పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 50 మంది అధ్యాపకులు పాల్గొన్నారని కళాశాల విభాగాధిపతి డి.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో డి.పాండురంగారావు, డాక్టర్ జి.సాయి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.70 వేల ఆదాయం

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో వేం చేసి ఉన్న రఘునాథస్వామి ఆలయానికి సంబంధించి పోలసానపల్లిలోని సర్వే నంబరు 161లోని 3.09 ఎకరాల విస్తీర్ణం గల వ్యవసాయ భూమికి శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవదాయ ధర్మదాయ అధికారులు కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఏడాదికి రూ.70 వేల చొప్పున హెచ్చు పాటకు అధికారులు ఖరారు చేశారు. గతంలో ఇదే భూమికి ఏడాదికి రూ.45,200 రాగా, ప్రస్తుతం అది పెరగడంతో రూ.24,800 అదనపు ఆదాయం లభించిందని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

రఘునాథస్వామి ఆలయంతో పాటు ఉపాలయాలైన సోమేశ్వర, వీరభద్రస్వామి ఆలయాల హుండీ కానుకలను గతేడాది మే 25 నుంచి ఈ ఏడాది జూన్ 16వ తేదీ వరకు సంబంధించిన కాలానికి మూడు ఆలయాల్లో కానుకలను లెక్కించారు. రూ.1,88,333 ఆదాయం వచ్చిందన్నారు. అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవస్థానం ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, గ్రామస్తుల సమక్షంలో లెక్కింపు చేపట్టారు.

19న బలివే రామలింగేశ్వరాలయ భూముల కౌలు వేలం

బలివే(ముసునూరు): దక్షిణ కాశీగా వినుతికెక్కిన, ప్రసిద్ధ, బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సేద్యపు భూముల కౌలుకు ఈ నెల 19వ తేదీ సోమవారం వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. వేల్పుచర్లలో దేవస్థానానికి చెందిన ఆర్.ఎస్ నంబర్ 376లోని 1.16 సెంట్ల వ్యవసాయ భూమిని మూడేళ్ల కాల పరిమితితో పంటలు పండించుకునే నిమిత్తం వేలం జరుగుతుందన్నారు. ఈనెల 19 సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరుగనున్న ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం అనంతరం 12 గంటలకు పోలీస్, రెవెన్యూ, భక్తులు, గ్రామ ప్రజల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కిస్తామని తెలిపారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి జరిగే ఈ లెక్కింపులో ఆలయ సిబ్బందితో పాటు ఔత్సాహికులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు: కొట్లాట విషయమై ఇరువర్గాలపై కేసు నమోదు అయిన ఘటన పెనుగంచిప్రోలులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఆలయం వద్దకు వచ్చిన భక్తుల మేకపోతును కోసే విషయమై ఇరువర్గాలు వారు కొట్లాడుకున్నారు. దీనికి సంబంధించి 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

తెలంగాణ మద్యం బాటిళ్ల పట్టివేత



నూజివీడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి మండలంలో ఏలూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ధనరాజ్, ఎస్ఐ అల్లూరయ్య సిబ్బంది కలిసి ఆగిరిపల్లి మండలంలో శుక్రవారం దాడులు నిర్వహించి 81 తెలంగాణ మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ నూజివీడు ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ తెలిపారు. ఆగిరిపల్లిలో వాకా రాంగారావు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాకా రంగారావు, పరసా ప్రసాద్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఈ మద్యం బాటిళ్లను సరఫరా చేసిన దాసరి వినోద్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. ఆగిరిపల్లి మండలం సగ్గూరుకు చెందిన చెంగల సింగారయ్యను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపామని చెప్పారు.

సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సూదిగట్టు వద్ద స్థలాన్ని పరిశీలిస్తోన్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, నాయకులు

నూజివీడు: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలను మంజూరు చేసి వారి సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమానులో నివేశన స్థలాల కోసం సూదిగట్టు వద్ద స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంతో కలిపి 12 వేల మందికి నివేశన స్థలాలను ఇచ్చామన్నారు. వాటిల్లో లబ్ధిదారులందరికీ గృహాలను సైతం ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఇళ్ల స్థలాలు మంజూరు కాని వారు వారి పరిధిలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఏనాడైనా పేదవారికి సెంటు స్థలం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని నిషేధిస్తూ జీవో తీసుకువచ్చారన్నారు.

ఊళ్ల నిర్మాణం..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి కాలనీలను కాకుండా ఊళ్లనే నిర్మిస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడే పాలకులే చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. గ్రామగ్రామాన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను నిర్మించి ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే దోచుకోవడం, దాచుకోవడమే తప్ప ప్రజలకు చేసేదేమీ లేదన్నారు. గతంలో ఇసుక, మట్టిని దోచుకున్నారని, జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ చేశారని చెప్పారు. కమీషన్ ఇచ్చిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు ఇచ్చారన్నారు. టీడీపీకి మరోసారి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభాస్కర్, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, నాయకులు మచ్చా హరిబాబు, ఎంపీటీసీ రాణిమేకల సత్యనారాయణ, ఉప సర్పంచ్ నల్లిబోయిన రాంబాబు, వాకా సక్కేశ్వరరావు, కుప్పాల నాగరాజు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా రైతు భరోసా కేంద్రాలు



రైతు సదస్సులో త్రిలోచన్ మహాపాత్రా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సాంబశివారెడ్డి

మైలవరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్రా ప్రశంసించారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఆదర్శ రైతు గోగులమూడి సాంబశివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు లాం ఫాంలో గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన రైతు సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రైతు ప్రతినిధులు హాజరయ్యారని సాంబశివారెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న త్రిలోచన్ మహాపాత్రా మాట్లాడుతూ.. మేలు రకమైన విత్తనోత్పత్తిపై రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారన్నారు. ఆధునిక యంత్ర సామగ్రిని వినియోగిస్తూ రైతులు మేలు రకమైన అధిక దిగుబడులు సాధించాలని తెలిపారన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఏ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ విధానంతో మేలు రకమైన అధిక దిగుబడి సాధించడంతో పాటు అధిక ఆదాయాన్ని కూడా సంపాదించవచ్చని తెలిపారన్నారు. సాంబశివారెడ్డి ప్రసంగించారు.

వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ ప్రారంభం



కొండపల్లి జెడ్పీ పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్న ఎంపీడీవో రామకృష్ణనాయక్ తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కడప జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు కొండపల్లి జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో సెలక్షన్స్ ప్రారంభమయ్యాయి. సెలక్షన్స్‌ను ఎంపీడీవో రామకృష్ణనాయక్ శుక్రవారం ప్రారంభించారు. 60 మంది 4, 5 తరగతుల విద్యార్థులకు ఎత్తు, బరువును బట్టి 30 మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్ నిర్వహించారు. ఈవెంట్లలో ప్రతిభ చూపిన వారిని జిల్లా సెలక్షన్స్‌కు పంపుతామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ పుష్పలత, హెచ్‌ఎం ఎంవి.శేషగిరి రావు, స్పోర్ట్స్ సెలక్షన్స్ ఇన్‌చార్జి సురేంద్రబాబు, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మాయమాటలు ప్రజలు నమ్మరు



కొండపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు ప్రజలు నమ్మే రోజులు పోయాయని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ కొండపల్లి మున్సిపాలిటీ అధికార ప్రతినిధి కుమ్మరి నాగరాజు, వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ అన్నారు. కొండపల్లిలో టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలను శుక్రవారం ఖండించారు. అభివృద్ధికి చిరునామాగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నిలిచారన్నారు. మైలవరం ప్రభుత్వ వైద్యశాల 50 పడకలుగా చేసి నూతన భవనం నిర్మించారని, రాష్ట్రంలో రెండు తోలు పరిశ్రమల్లో ఒకటి జి.కొండూరుకు తీసుకొచ్చారని, ప్రతి గ్రామానికి కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. కొండపల్లి అడవి క్వారీలో టీడీపీ ఇచ్చిన నివాసయోగ్యం కాని స్థలాలు రద్దు చేయించి కొండపల్లి జగనన్న కాలనీలో ఇచ్చింది ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. కౌన్సిలర్ నాగరాజకుమారి, నాయకులు పాల్గొన్నారు.

నూరు శాతం రుణాల వసూలు



పీఏసీఎస్ సిబ్బందిని అభినందిస్తున్న చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి

ఏ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు గ్రామంలోని పీఏసీఎస్‌లో రైతులకు అందించిన వ్యవసాయ రుణాలు నూరు శాతం వసూలు చేశామని పీఏసీఎస్ సీఈవో పి.కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందించిన వ్యవసాయ రుణాలు వరుసగా 8వ సారి రూ.10.28 కోట్లు వసూలు చేశామన్నారు. రుణాల వసూలుకు సహకరించిన పీఏసీఎస్ సీఈవో కోటేశ్వరరావు, సిబ్బంది, సంఘ సభ్యులను, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణను పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వల్లంపట్ల సర్పంచ్ జూపల్లి రాజేష్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విస్సన్నపేట: బాలింతలు క్రమం తప్పకుండా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవటం వలన తల్లీ బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. స్థానిక ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో జన భగీదారీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బిడ్డలకు తల్లిపాలు శ్రేయస్కరమని, తప్పనిసరిగా తల్లి పాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.